సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 17 । మే । 2024



పారిశ్రామిక శిక్షణ.. ఉపాధికి నిచ్చెన 8లో



అరకు కాఫీ.. MADE IN ANDHRA 8లో



ముందస్తు 'నైరుతి' 8లో

న్యూస్‌రీల్

చందనం విక్రయాలు ప్రారంభం



చందనం ప్యాకెట్లను అందజేస్తున్న సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై గురువారం నుంచి చందనం విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి ప్రసాద విక్రయశాలలోని కౌంటరులో సుమారు 10 గ్రాముల చందనం ప్యాకెట్‌ను రూ.10 చొప్పున విక్రయించారు. దేవస్థానం ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ పలువురు భక్తులకు ఈ ప్యాకెట్లను అందజేశారు. ఈ నెల 17, 19, 20, 21 తేదీల్లో మాత్రమే చందనం విక్రయిస్తారు. కాగా.. చందనం కొనుగోలు చేసేందుకు భక్తులు బారులు దీరారు.

అందుబాటులో శ్రీవారి అగరబత్తులు



కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ తయారు చేసిన అగరబత్తులు అందుబాటులో ఉన్నాయి. ఆల్ ఇన్ వన్ కాంబో ప్యాక్ రూ. 475, అలాగే రూ.45, రూ.85 ధరలు గల అగరబత్తులు ఇక్కడ విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

22న నృసింహ హోమం

సింహాచలం: సింహగిరిపై ఈ నెల 22న పెద్ద ఎత్తున శ్రీ నృసింహ హోమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈ నెల 22న నృసింహ జయంతి, శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి జన్మ నక్షత్రమై స్వాతి నక్షత్రం కలిసి వచ్చాయని వివరించారు. ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న విశాల ప్రాంగణంలో జరిగే ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులను భాగస్వాములను చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. నృసింహ హోమంలో పాల్గొనే భక్తులు రూ.2,500 టికెట్‌ను www.aptemples.ap.gov.inలో తీసుకుని ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ పాల్గొనవచ్చని తెలిపారు. అలాగే సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో కూడా టికెట్లు లభిస్తామని వివరించారు.

ఇగ్నోలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో)లో 2024 విద్యా సంవత్సరం జూలై ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖ ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. కేంద్రం పరిధిలోని 11 జిల్లాల విద్యార్థులు https:// ignouadmission. samarth. edu. in/ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు జూన్ 30 చివరి తేదీ అని, మరిన్ని వివరాలకు ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు.

ఐఏసీ బాహుబలి విశాల్



ఐఎన్ఎస్ విక్రాంత్



ఐఎన్ఎస్ విశాల్ నమూనా

- భారత మూడో ఎయిర్ క్రాఫ్ట్ కేరియర్ 'ఐఎన్ఎస్ విశాల్'
- రూ.50 వేల కోట్లతో నిర్మాణం.. 2030 కల్లా అందుబాటులోకి..
- పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారీకి ప్రణాళికలు

సాక్షి, విశాఖపట్నం: రక్షణ రంగంలో బలీయమైన శక్తిగా ఎదిగేందుకు భారత్ వినూత్న వ్యూహాలతో దూసుకువెళుతోంది. యుద్ధ విమాన వాహక నౌకల విషయంలో వెనుకబడి ఉన్న భారత్..ఆ లోటును భర్తీ చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఎయిర్ క్రాఫ్ట్ కేరియర్ల విషయంలో చైనా దూకుడుగా ఉన్న నేపథ్యంలో ఐఎన్ఎస్ విక్రాంత్ మాదిరిగా..మరో షిప్ ఐఎన్ఎస్ విశాల్‌ను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసేందుకు ప్రణాళికలు రచించింది. దీంతో పాటు మరో 3 ఇండియన్ ఎయిర్‌క్రాఫ్ట్ కేరియర్ (ఐఏసీ)లు రూపొందించేందుకు విధివిధానాల్ని రక్షణ శాఖ నిర్ణయించింది. రక్షణ వ్యవస్థకు ఎన్నడూ లేని విధంగా కేంద్రం బడ్జెట్ కేటాయిస్తున్న నేపథ్యంలో..అధునాతన ఆయుధ, నౌకా సంపత్తిని సొంతం చేసుకునే దిశగా అడుగులు పడుతున్నాయి. మూడో, అతి పెద్ద ఐఏసీకి సంబంధించిన ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. భారత నౌకాదళం ప్రస్తుతం ఉన్న ఐఏసీ-2 విక్రాంత్ కంటే పెద్దదిగా ఉండే మూడో స్వదేశీ విమాన వాహక నౌక కోసం అధ్యయనం పూర్తయింది. ప్రస్తుతం ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్‌లు సేవలందిస్తున్నాయి. విక్రమాదిత్య జీవితకాలం మరో నాలుగేళ్లలో ముగిసే అవకాశం ఉండటంతో ఈలోగా కొత్త ఐఏసీని అందుబాటులోకి తీసుకురావాలని నేవీ అధికారులు భావిస్తున్నారు.

విక్రాంత్ కంటే భారీగా..

తదుపరి నిర్మించబోయే యుద్ధ విమాన వాహక నౌక.. దేశంలోనే అతిపెద్ద ఐఏసీగా నిర్మించాలని నేవీ నిర్ణయించింది. దీనికి ఐఎన్ఎస్ విశాల్‌గా నామకరణం చేసింది. ప్రస్తుతం ఉన్న విక్రాంత్ పరిమాణం 44,000 టన్నులు కాగా.. మూడో నౌక విశాల్‌ని 65,000 టన్నుల వరకు నిర్మించాలని భావిస్తోంది. కొత్త సాంకేతికతలతో కూడిన కొత్త ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ కాటాపుల్ట్ సిస్టమ్ (హైడ్రాలిక్‌తో నడిచే) ద్వారా ల్యాండింగ్ అయ్యే విధంగా నౌకా నిర్మాణ సౌకర్యాన్ని అప్‌గ్రేడ్ చేయనుంది. విక్రాంత్‌ని తయారు చేసిన కొచ్చి షిప్‌యార్డులోనే విశాల్‌ని తీర్చిదిద్దేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీనికి రూ.50 వేల కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. జూలై తర్వాత విశాల్‌పై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

చైనాకు దీటుగా..

హిందూ మహాసముద్రంలో చైనా కవ్వింపు చర్యలు దేశ రక్షణ వ్యవస్థకు కంటగింపుగా మారుతున్న నేపథ్యంలో వైమానిక శక్తిని ఒకవైపు మలక్కా జలసంధి, మరోవైపు ఎడెన్ గల్ఫ్ వంటి సుదూర ప్రాంతాలకు విస్తరించాల్సిన అవసరముంది. ఈ తరుణంలో ఎయిర్‌క్రాఫ్ట్ కేరియర్లని అన్ని వైపులా మోహరించాల్సి ఉంటుంది. పశ్చిమ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న విక్రమాదిత్యని, తూర్పు తీరంలో గస్తీ కాస్తున్న విక్రాంత్‌ని మలక్కా, ఎడెన్ ప్రాంతాల్లో మోహరింపజేస్తే..భారత సముద్ర జలాల్లో మరో ఐఏసీ అవసరమవుతుంది. అందుకే..కొత్త షిప్‌ని నిర్మించాల్సి ఉంటుందని నేవీ భావిస్తోంది. చైనా అమ్ముల పొదిలో లియానింగ్, షాన్‌డాంగ్ అనే ఎయిర్‌క్రాఫ్ట్ కేరియర్స్ ఉన్నాయి. మూడో కేరియర్ ఫుజియాన్ సీ ట్రయల్స్ కూడా పూర్తి చేసుకుంది. ఇది యూకే, ఫ్రాన్స్, భారత్‌లో ఉన్న ఐఏఎఫ్‌ల కంటే అతి పెద్దది. ఈ క్రమంలో భారత్ కూడా మరో ఐఏఎఫ్ కోసం సిద్ధమవుతోంది. 2030 కల్లా విశాల్‌ని అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

కొత్త బస్సులతో ఖుషీ!

- ఇటీవల ఆరు బస్సులు రాక
- త్వరలో మరో 40 వచ్చే అవకాశం
- వీటిలో సూపర్ లగ్జరీలు, అల్ట్రా డీలక్స్‌లు
- కాలం చెల్లిన వాటిలో కొత్తవి సర్దుబాటు



కొత్త సూపర్ లగ్జరీ బస్సు

సాక్షి, విశాఖపట్నం: ఆర్టీసీలో కొత్త బస్సుల కోలాహలం నెలకొంది. పాత బస్సుల స్థానంలో వస్తున్న ఈ నయా బస్సులతో ఆర్టీసీ ఖుషీ ఖుషీగా ఉంది. పది లక్షల కిలోమీటర్లు, 15 ఏళ్లు తిరిగిన బస్సులను కాలం చెల్లిన జాబితాలో చేరుస్తారు. ఇలాంటి వాటిని తొలగించి వాటికి బదులు కొత్తవి సమకూరుస్తారు. విశాఖ జిల్లాలో ప్రస్తుతం 40కి పైగా కాలం చెల్లిన బస్సులున్నాయి. దీంతో ఈ బస్సులు వివిధ రకాల శబ్దాలతో రోడ్లపై పరుగులు తీస్తూ ప్రయాణికులకు అసౌకర్యంగా ఉంటున్నాయి. కొన్ని బస్సుల్లో అయితే సీట్లు, కిటికీల అద్దాలు కూడా కండిషన్‌లో ఉండడం లేదు. బస్సు సస్పెన్షన్లు కూడా దెబ్బ తిని కుదుపులకు గురి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా వస్తున్న ఈ బస్సులు ఎంతో ఆకర్షణీయంగా, రంగులు, హంగులతో కనిపిస్తున్నాయి. సరికొత్త డిజైన్లతో పాటు లోపల సీట్లు కూడా సౌకర్యవంతగా ఉంటున్నాయి. దీంతో ఈ కొత్త బస్సులు ప్రయాణికులను ఎంతగానో ఆకట్టుకోనున్నాయి. కాగా తొలుత ఇటీవల విశాఖకు ఆరు కొత్త బస్సులను కేటాయించారు. వీటిలో మూడు సూపర్ లగ్జరీలు, మూడు అల్ట్రా డీలక్స్‌లు ఉన్నాయి. త్వరలో మరో 40 వరకు కొత్త బస్సులు రానున్నాయి. ఇందులో 34 సూపర్ లగ్జరీలు, ఆరు డీలక్స్‌లు ఉండే అవకాశం ఉంది. వీటిని ప్రస్తుతం సర్దుబాటు చేసిన దూరప్రాంత రూట్లలోను, నాన్‌స్టాప్ సర్వీసులుగాను నడుపుతారు.

కొత్త బాడీలతో సిటీ బస్సులుగా మార్పు..

మరోవైపు పది లక్షల కిలోమీటర్లు తిరిగిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ/అల్ట్రా డీలక్స్ బస్సులను సిటీ బస్సులుగా మార్పు చేయనున్నారు. ఇంజిను కండిషన్‌ను మెరుగు పరచడంతో పాటు చాసిస్‌లు బాగున్న బస్సులకు కొత్తగా బాడీలు కట్టించనున్నారు. విజయనగరంలోని జోనల్ వర్క్‌షాపులో ఈ బస్సుల మార్పు పనిని చేపట్టనున్నారు. ఇలా ఆర్టీసీ విశాఖ జిల్లాకు సంబంధించి 40-50 బస్సులను సిటీ బస్సులుగా మార్చనున్నారు.

45 రోజుల్లో 10 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు ఎగుమతి

విశాఖ పోర్టు రికార్డు



విశాఖపట్నం పోర్టు

సాక్షి, విశాఖపట్నం: సరుకు హ్యాండ్లింగ్‌లో మేజర్ పోర్టులతో పోటీ పడుతూ నంబర్ వన్ దిశగా అడుగులు వేస్తున్న విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) మరో మైలురాయిని అధిగమించింది. కేవలం 45 రోజుల్లోనే 10 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు ఎగుమతి, దిగుమతులు నిర్వహించి రికార్డు సృష్టించింది. 2024-25లో శరవేగంగా సరుకు హ్యాండ్లింగ్ నిర్వహణ కొనసాగుతోందని పోర్టు చైర్మన్ డా.అంగముత్తు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం 90 ఎంఎంటీ లక్ష్యంగా నిర్దేశించుకున్నామని వెల్లడించారు. 2023-24లో 10 ఎంఎంటీకి 47 రోజులు పట్టగా.. ఈసారి రెండు రోజుల ముందుగానే లక్ష్యాన్ని చేరుకున్నట్లు చైర్మన్ వివరించారు.

స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ



స్ట్రాంగ్ రూమ్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున గురువారం తనిఖీ చేశారు. అక్కడ భద్రతాపరమైన చర్యలను పరిశీలించారు. అన్ని విభాగాల అధికారులు, పోలీస్ సిబ్బంది విధి నిర్వహణపై ఆరా తీశారు. భీమిలి, విశాఖ తూర్పు, ఉత్తర, పశ్చిమ, దక్షిణ, గాజువాక తదితర అసెంబ్లీ నియోజకవర్గాల స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి.. అధికారులు, పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

అభ్యర్థులను తీసుకెళ్తాం

ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు గానీ, వారి ఏజెంట్లను గానీ ఏయూలోని స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించడానికి తీసుకెళ్తామని కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్ట్రాంగ్ రూమ్‌లకు ఈ నెల 14న సీల్ వేశామని, ప్రవేశ ద్వారం, ఆవరణ కనిపించే విధంగా సీసీ టీవీలను అమర్చినట్లు వివరించారు. ఈ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. అక్కడ సీసీ ఫుటేజీను అభ్యర్థులు గానీ, వారి ఏజెంట్లు గానీ చూసేందుకు వీలుగా కంట్రోల్ రూమ్‌ల్లో మానిటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు, రాత్రి పది గంటలకు పోలీసు సిబ్బంది, అధికారుల సమక్షంలో అభ్యర్థులను గానీ, వారి ఏజెంట్లను గానీ స్ట్రాంగ్ రూమ్ సీల్‌లను పరిశీలించడానికి తీసుకెళ్తామన్నారు. సీల్, సంతకం చేసిన కాగితాలను తాకడం, ఇతర కార్యకలాపాలు చేపట్టడానికి అనుమతి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

- స్ట్రాంగ్ రూమల వద్ద భద్రతపై దృష్టి సారించాలి
- ఆర్వోలకు కలెక్టర్ మల్లికార్జున ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: జిల్లాలో జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆర్వోలు, ఇతర అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో గురువారం నిర్వహించిన సమావేశంలో వివిధ అంశాలపై ఆయన చర్చించారు. పోలింగ్ అనంతరం ఆయా స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంల తరలింపు, సాంకేతిక ప్రక్రియల పూర్తి, ఇతర అంశాల గురించి ఆయా ఆర్వోలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలో చేపట్టిన చర్యలు సంతృప్తికరంగా సాగాయని, అందరూ సమష్టి కృషితో సేవలందించారన్నారు. ఇదే ఒరవడిని కౌంటింగ్ ప్రక్రియలో కూడా కొనసాగించాలని సూచించారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమల వద్ద భద్రతాపరమైన ఏర్పాట్లపై రోజు వారీ సమీక్షించుకోవాలన్నారు. ప్రతి రోజూ స్ట్రాంగ్ రూమ్‌లను చూసిరావాలన్నారు. పోటీ చేసిన అభ్యర్థులతో రోజూ సంప్రదించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోస్టల్ బ్యాలెట్లను కూడా నిర్ధీత సమయంలో స్ట్రాంగ్ రూమ్‌లకు చేరవేయాలని, భద్రతాపరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఇతర జిల్లాలకు చెందిన పోస్టల్ బ్యాలెట్లను వేరు చేసి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ నాటికి ఎలాంటి సాంకేతిక అంశాలు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని, అన్ని రకాలుగా సిద్ధంగా ఉండాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియను సజావుగా, విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బందికి శిక్షణ శిబిరాలు నిర్వహించాలన్నారు. ఎంసీసీ నోడల్ అధికారి సీఎం సాయికాంత్ వర్మ, జేసీ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్వోలు, ఏఆర్వోలు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కార్మికులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్

- ఒక్కొక్కరికీ రూ.27 లక్షలు చెల్లించేందుకు యాజమాన్యం అంగీకారం
- సీపీ సమక్షంలో కుదిరిన ఒప్పందం



సీపీ సమక్షంలో అంగీకారపత్రం అందజేస్తున్న పోర్టు ప్రతినిధులు

గాజువాక: అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. పోర్టులో ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద నగదును అందజేసేందుకు పోర్టు యాజమాన్యం ముందుకొచ్చింది. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ సమక్షంలో పోర్టు యాజమాన్యానికి, కార్మిక నాయకులకు మధ్య గురువారం ఒప్పందం కుదిరినట్టు కార్మిక నాయకులు తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం ప్రస్తుతం పోర్టులో పనిచేస్తున్న నిర్వాసిత కార్మికుల్లో ఒకొక్కరికీ వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద రూ.27 లక్షల చొప్పున చెల్లించనున్నారు. మొత్తం 519 మంది కార్మికులకు ఈ ఒప్పందం ప్రకారం నగదును చెల్లిస్తారు. మొత్తం కార్మికులందరికీ రెండు, మూడు రోజుల్లో నగదును చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించడంతో కార్మికులు సమ్మెను విరమించడానికి సిద్ధపడినట్టు పోర్టువర్గాలు తెలిపాయి. తమకు రూ.36 వేల కనీస వేతనం చెల్లించడంతోపాటు గతంలో జరిగిన ఒప్పందాలను అమలు చేయాలని, లేనిపక్షంలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అదాని గంగవరం పోర్టు కార్మికులు గడిచిన నెల రోజులుగా సమ్మెబాట పట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జరిగిన చర్చలు ఎట్టకేలకు విజయవంతం కావడంతో కార్మికులు ఊపిరి పీల్చుకున్నారు.

గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్



విద్యార్థికి ప్రవేశ ధ్రువపత్రం అందిస్తున్న కో-ఆర్డినేటర్ రూపావతి

సబ్బవరం: ఉమ్మడి విశాఖ జిల్లాలోని బాలుర గురుకుల కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం స్థానిక సబ్బవరం బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని సబ్బవరం, దేవరాపల్లి, గొలుగొండ, శ్రీకృష్ణాపురం గురుకుల కళాశాలల్లో ప్రవేశాల కోసం ఇప్పటికే ప్రవేశ పరీక్ష నిర్వహించి, ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఆన్‌లైన్ విధానం ద్వారా సీట్లు భర్తీ చేశారు. మిగులు సీట్ల కోసం మెరిట్ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి సీట్లు భర్తీ చేసేందుకు ఈ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌కు సుమారు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆయా కళాశాలల్లో 188 సీట్లు ఖాళీగా ఉండగా, కౌన్సెలింగ్ ద్వారా 81 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. అడ్మిషన్ కౌన్సెలింగ్ చైర్మన్‌గా ఉమ్మడి జిల్లా గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపావతి, సభ్యులుగా ఆయా గురుకులాల ప్రిన్సిపాల్స్ సీహెచ్.వి.వి.సత్యారావు, ఆర్.రామకృష్ణ, సీహెచ్ రవీంద్రనాథ్, వి.రత్నవల్లి వ్యవహరించారు.

సాక్షి మైత్రి మహిళ

బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి జూన్ 24వ తేదీ వరకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఇస్తారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికేట్లు అందజేయబడతాయి.

శిక్షణలో నేర్పించే అంశాలు :

1. త్రెడ్డింగ్, 2. వ్యాక్స్, 3 పెడిక్యూర్, 4. మెనిక్యూర్, 5. బ్లీచింగ్, 6. స్కిన్ కేర్, 7. హెయిర్ కేర్, 8. వైట్నింగ్ ఫేస్ ప్యాక్స్, 9. డ్యాండ్రఫ్ ట్రీట్‌మెంట్, 10. హెయిర్ ఫాల్ ట్రీట్‌మెంట్, 11. హెయిర్ కట్స్, 12. హెయిర్ స్టైల్స్, 13. హెన్నా ప్రిపరేషన్ 14, డై అప్లికేషన్, 15. మేకప్స్ (బ్రైడల్, పార్టీ మరియు లైట్ మేకప్స్) 16. పింపుల్ ట్రీట్‌మెంట్, 17. హెయిర్ మసాజ్, 18. కమ్యూనికేషన్ అండ్ గ్రూమింగ్, 19. ఫేషియల్స్, 20. సారీ డ్రాపింగ్.

రిజిస్ట్రేషన్స్ స్వీకరించు తేదీలు : 17-5-2024 నుంచి 26-5-2024 వరకు
సమయం : ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు
ఫీజు : 3000/-
వర్క్‌షాపు షెడ్యూలు తేదీలు : 27-05-2024 నుంచి 24-06-2024 వరకు
సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు

రిజిస్ట్రేషన్ మరియు శిక్షణా స్థలం :

వనితశ్రీ బ్యూటీ ఇన్‌స్టిట్యూట్

బాలాజీ హిల్ వ్యూ ఎన్‌క్లేవ్, వేపగుంట, గోశాల, బి.ఆర్.టి.ఎస్.రోడ్, విశాఖపట్నం

సంప్రదించవలసిన నంబర్లు : 70757 09205, 91001 73200

దాడి కేసులో రాజకీయ ప్రమేయం లేదు

- రెండు కుటుంబాల మధ్య వివాదం
- డీసీపీ మేక సత్తిబాబు



మీడియాతో మాట్లాడుతున్న డీసీపీ సత్తిబాబు

సీతమ్మధార: కంచరపాలెం పరిధిలో బుధవారం రాత్రి ఓ కుటుంబంపై జరిగిన దాడి వ్యక్తిగత గొడవల వల్లే తప్ప.. రాజకీయ ప్రమేయం లేదని డీసీపీ మేక సత్తిబాబు తెలిపారు. ఓట్ల కోసం జరిగిన దాడిగా తప్పుడు ప్రచారం జరుగుతుందని విచారం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. స్థానిక బర్మా క్యాంప్, నూకాలమ్మ ఆలయం సమీపంలో సుంకర నూకరత్నం (నిరీష) కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఆమె ఇంటికి సమీపంలో ఆశ కుటుంబంతో ఉంటున్నారు. ఈ రెండు కుటుంబాల మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి చిన్నపాటి వివాదానికి ముందుగా నూకరత్నం, ఆమె కుటుంబ సభ్యులు ఆశ ఇంటిపై గొడవకు దిగి, వారి ఇంటిపై బీరు సీసాలు విసిరారు. ఇంటికి సమీపంలో ఉన్న ఆశ బంధువైన లోకేష్‌కు విషయం తెలిసి అక్కడికి చేరుకున్నాడు. అక్కడే ఉన్న నూకరత్నం, ఆమె తల్లి ధనలక్ష్మి, కుమారుడు మణికంఠపై కర్రతో దాడి చేశాడు. గాయాలపాలైన వారంతా కేజీహెచ్ వెళ్లి అత్యవసర విభాగంలో చేరారు. అక్కడ బాధితులిచ్చిన ఎమ్మెల్సీ రిపోర్టు ప్రకారం పోలీసులు దాడికి పాల్పడిన లోకేష్, మరో నలుగురిపై కేసు నమోదు చేశారు. లోకేష్‌ను రిమాండ్‌కి తరలించారు. సమావేశంలో ఏసీపీ అన్నెపు నరసింహామూర్తితోపాటు సీఐ ఎస్.భాస్కర రావు, కంచరపాలెం ఎస్ఐ దివ్యభారతి పాల్గొన్నారు.

టీడీపీ నేతలు తప్పుడు ప్రచారం

రెండు కుటుంబాల మధ్య వివాదానికి టీడీపీ నేతలు రాజకీయ రంగు పులిమి దుష్ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీకి ఓటేయలేదని ఆ నేతలే దాడి చేశారని పరామర్శ పేరుతో బాధితుల ఇంటికి వెళ్లి డ్రామాలు చేశారు. బాధితులతో ఆ విషయం చెప్పించారు. వాస్తవంగా పాత గొడవలు నేపథ్యంలోనే తమపై దాడి చేశారంటూ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితులు పేర్కొన్నారు. వాస్తవాలను పక్కనపెట్టి రాజకీయ దాడి అంటూ టీడీపీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు.



పారిశ్రామిక శిక్షణ.. ఉపాధికి నిచ్చెన



శిక్షణ తరగతుల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

- ఐటీఐల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- పలు ట్రేడుల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు
- అందుబాటులో 3,286 సీట్లు

కంచరపాలెం: పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు త్వరగా ఉపాధి పొందే కోర్సుల్లో ఐటీఐ ఒకటి. ప్రధానంగా జిల్లా విద్యార్థులు ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్‌తో పాటు ఐటీఐ చదివేందుకు అధిక ప్రాధాన్యమిస్తారు. ఐటీఐ కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులు అప్రెంటిస్ తర్వాత పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు. డాక్‌యార్డ్, ఆర్టీసీ, షిప్‌యార్డ్, రైల్వే, విద్యుత్, రక్షణశాఖ వంటి వాటిల్లో సైతం ఉద్యోగాలకు ప్రయత్నం చేసుకోవచ్చు. చదువులో ఒత్తిడి ఉండదు. అయితే విద్యార్థులకు సాంకేతిక రంగంపై నైపుణ్యాలు తప్పనిసరి. నైపుణ్యం ఉన్న విద్యార్థులకు తప్పకుండా ఉపాధి లభిస్తుంది. ఉద్యోగంతో పాటు స్వయం ఉపాధికి సైతం ఈ కోర్సులు ఎంతగానో దోహదపడతాయి.

పలు ట్రేడుల్లో శిక్షణ

- విశాఖ నగర పరిధిలో నాలుగు ప్రభుత్వ, 31 ప్రైవేట్ ఐటీఐల్లో 3,286 సీట్లు ఉన్నాయి. ఏడాది, రెండేళ్ల వ్యవధి ఉన్న ట్రేడుల్లో శిక్షణ ఇస్తున్నారు. కొన్ని ట్రేడులు 8వ తరగతి విద్యార్హతతో సైతం నిర్వహిస్తున్నారు.
- **ఏడాది కోర్సులు:** మెకానికల్ డీజిల్, వెల్డర్, కటింగ్ అండ్ సీయింగ్, కంప్యూటర్ ప్రోగ్రామ్ అసిస్టెంట్, ప్లంబర్, కోపా, కార్పెంటర్, స్టెనోగ్రఫీ
- **రెండేళ్ల కోర్సులు:** ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానికల్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మెకానికల్, డీఎం సివిల్, డీఎం మెకానికల్, మిషనిస్ట్, పెయింటర్, ఐఎం కెమికల్, ఎంఎంటీఎం, ఆర్ అండ్ ఏసీ మెకానిక్, ఏవో కెమికల్
- ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం(ఐటీఐ)కు వెళ్లి పరిశీలించుకోవాలి. దరఖాస్తులు పరిశీలన పూర్తయిన విద్యార్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హత సాధిస్తారు. జూన్ ఆఖరి తేదీలోపు ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేస్తారు. జూలై నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

ఐటీఐలో ప్రవేశాలకు నోటిఫికేషన్	ఈ నెల 08
దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం	09
దరఖాస్తుల స్వీకరణ చివరి తేదీ	జూన్ 10
సహాయ కేంద్రాల్లో పరిశీలన చివరి తేదీ	జూన్10
సహాయ కేంద్రాలు	కంచరపాలెం పాత ఐటీఐ, న్యూ ఐటీఐ గాజువాక, నరవ ఐటీఐ, బాలికల ఐటీఐ ఇండస్ట్రియల్ ఏరియా, కంచరపాలెం
ఏడాది కోర్సులు	8
రెండేళ్ల కోర్సులు	15
ప్రభుత్వ ఐటీఐల్లో సీట్లు	1,648
ప్రైవేట్ ఐటీఐలు	28
ప్రైవేట్ ఐటీఐల్లో సీట్లు	1,638
వెబ్‌సైట్	iti.ap.gov.in

శిక్షణతో పాటు ఉద్యోగం, ఉపాధి



పారిశ్రామిక శిక్షణ కేంద్రం(ఐటీఐ) విద్యార్థులకు అప్రెంటిస్, స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. ఏడాది కోర్సుల్లో కొత్తగా రెండు ట్రేడ్లు చేర్చాం. విద్యార్థులు ఏడాది, రెండేళ్ల కోర్సుల్లో చేరవచ్చు. షెడ్యూల్ మేరకు ఆన్‌లైన్‌లో జూన్ 10లోపు సమీప ప్రభుత్వ ఐటీఐలకు విధిగా హాజరై దరఖాస్తులను వెరిఫికేషన్ చేయించుకోవాలి. కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలను విద్యార్థి మొబైల్ నంబర్‌కు పంపిస్తాం. సందేహాలు ఉంటే ప్రభుత్వ ఐటీఐలను సంప్రదించవచ్చు. రిజర్వేషన్ రోస్టర్ బట్టి ప్రవేశాలు కల్పిస్తాం.

– జె.శ్రీకాంత్ ప్రిన్సిపాల్, కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ(ఓల్డ్), కంచరపాలెం

అరకు కాఫీ.. MADE IN ANDHRA

దేశంలోని టాప్ కాఫీ బ్రాండ్స్‌లో ఒకటిగా ఎదిగిన అరకు కాఫీని.. ప్రజలకు అందించేందుకు గిరిజన సహకార సంస్థ కార్యాచరణతో ముందుకు సాగుతోంది. ఎప్పటికప్పుడు సరికొత్త ఫ్లేవర్స్‌లో కాఫీ ప్రియులకు అరకు కాఫీని పరిచయం చేస్తున్న జీసీసీ.. ఇకపై మేడిన్ ఆంధ్ర లేబుల్‌తో మార్కెట్‌లోకి విడుదల చేసేందుకు డౌనూరులో రూ.3 కోట్ల వ్యయంతో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను సిద్ధం చేస్తోంది.

- ఇప్పటివరకు బెంగళూరులో... ఇకపై డౌనూరులోనే తయారీ
- క్యూరింగ్, ప్యాకింగ్ ఇక్కడే..
- కాఫీ ప్రాసెసింగ్‌కు జీసీసీ సహకారం
- త్వరలోనే ఏపీలోనే తయారీ పేరుతో కాఫీ సాచెట్స్, టిన్స్ విడుదల





సాక్షి, విశాఖపట్నం: సేంద్రియ పద్ధతుల్లో తయారయ్యే అరకు కాఫీ అంటే తెలియనివారంటూ ఉండరు. ఏజెన్సీలోని వాతావరణమే అరకు కాఫీ రుచికి ప్రధాన కారణం. ఇక్కడ పండే అరబికా రకం కాఫీ రుచికి పారిస్, జపాన్, దక్షిణ కొరియా, స్విట్జర్లాండ్ దేశాల్లోని నగరాల ప్రజలు సలాం కొట్టారు. అందుకే.. 2018లోనే బ్రెజిల్, సుమత్రా, కొలంబోతో పాటు ఇతర దేశాలను వెనక్కు నెట్టేసి ప్రిక్స్ ఎపిక్యూర్–2018 పోటీల్లో అరకు కాఫీ బంగారు పతకాన్ని సాధించింది. ఇలాంటి చరిత్ర ఉన్న అరకు కాఫీ ప్రాసెసింగ్ అంతా ఇకపై ఆంధ్రలోనే కానుంది.

సేంద్రియ విధానం వల్లే గిరాకీ..

అరకు కాఫీ టేస్టీగా ఉండటమే కాకుండా సేంద్రియ విధానంలో పండించడం వల్ల గిరాకీ సొంతం చేసుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మొత్తం 2.27 లక్షల ఎకరాల్లో కాఫీ తోటలు విస్తరించి ఉన్నాయి. ఈ తోటల్లో ఏడాదికి 71,258 మెట్రిక్ టన్నుల కాఫీ పండ్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఇందులో ప్రస్తుతానికి రెండు క్లస్టర్లలో 2,258.55 హెక్టార్ల విస్తీర్ణంలో ఆర్గానిక్ పద్ధతుల్లో కాఫీని పండిస్తున్నారు. చింతపల్లి క్లస్టర్ వరసగా మూడో ఏడాది కూడా నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ఆర్గానిక్ ప్రొడక్షన్ (ఎన్‌పీవోపీ) స్టాండర్డ్స్ సర్టిఫికెట్ తీసుకోగా.. జీకే వీధి క్లస్టర్ ఇప్పటికే రెండు సార్లు స్కోప్ సర్టిఫికెట్ దక్కించుకుంది. మూడో ఏడాదీ సేంద్రియ సాగుకు సంబంధించి స్కోప్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంది.

2,600 మంది టాప్ గ్రేడ్ రకం సాగు..

ప్రస్తుతం కాఫీ గింజల క్యూరింగ్, ప్రాసెసింగ్ అంతా బెంగళూరులో జరుగుతోంది. అవుట్ సోర్సింగ్ ఏజెన్సీతో టైఅప్ కారణంగా ప్రాసెసింగ్ వ్యయం పెరుగుతోంది. డౌనూరులో క్యూరింగ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభమైతే ఈ ఖర్చులు తగ్గే అవకాశం ఉంటుంది. ఏజెన్సీలోని 11 మండలాల్లో 2,27,021 ఎకరాల విస్తీర్ణంలో కాఫీ తోటలున్నాయి. మొత్తం 93,521 మంది గిరిజనులు కాఫీ సాగులో పాల్గొంటున్నారు. వీరిలో 2,600 మంది రైతులు టాప్ గ్రేడ్ రకాన్ని సాగు చేస్తున్నారు. వీరి నుంచి సేకరించిన బీన్స్‌ని ఫిల్టర్ కాఫీ ఉత్పత్తి కోసం బెంగళూరుకు, ఇన్‌స్టెంట్ కాఫీ పౌడర్ ఉత్పత్తి, రిటైల్ మార్కెటింగ్‌కు ఏలూరు పంపిస్తుంటారు. ఇకపై ఇక్కడి నుంచే చేసేలా క్యూరింగ్ వ్యవస్థ సిద్ధమవుతోంది. త్వరలోనే మేడిన్ ఆంధ్రప్రదేశ్ పేరుతో అరకు కాఫీ ఉత్పత్తులు మార్కెట్‌లోకి రానున్నాయి.

కాఫీకి మార్కెటింగ్ సౌకర్యం

గిరిజన రైతుల జీవనోపాధి, ఆదాయ స్థాయిలను మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యంగా సీఎం జగన్ ఏజెన్సీ ప్రాంతంలో కాఫీ అభివృద్ధికి ప్రణాళికపరంగా చర్యలు చేపట్టారు. పాడేరు ఏజెన్సీ పరిధిలోని 11 మండలాల్లో సుమారు లక్షకు పైగా ఎకరాల్లో కాఫీ ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. గిరిజనులు పండించిన కాఫీకి జీసీసీ ద్వారా మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించారు. ఎన్నడూ లేని విధంగా గిరిజన రైతు పండించిన కాఫీని జీసీసీ భారీ మద్దతు ధరకు కొనుగోలు చేసింది. పార్చ్‌మెంట్ కాఫీ కిలోకి రూ.285, చెర్రీ కాఫీ కిలోకి రూ.145 మార్కెట్ ధరగా ప్రకటించి కొనుగోలు చేయడంతో మధ్యవర్తుల దోపిడీ ఆగింది. తద్వారా గిరిజనుల జీవనోపాధికి తగిన ఆదాయాన్ని ప్రభుత్వం జీసీసీ ద్వారా అందించింది. 2023–24లో ఇప్పటి వరకూ 564.48 మెట్రిక్ టన్నుల ముడి కాఫీని రైతుల నుంచి జీసీసీ కొనుగోలు చేసి రూ.13.39 కోట్లను వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేసింది.

ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఉపయోగాలివీ..

రాష్ట్ర ప్రభుత్వం నర్సీపట్నం సమీపంలోని డౌనూరులో ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేసింది. 2023 అక్టోబర్ 20న ఈ యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. ఈ యూనిట్ వద్ద గిరిజనులకు పెద్ద ఎత్తున లాభం కలగనుంది. జీసీసీ ముడి కాఫీని క్యూరింగ్ చేయడం నుంచి రోస్ట్ చేయడం, గ్రైండింగ్, బ్లెండింగ్, ప్యాకేజింగ్ మొదలైన అన్ని ఫీచర్లని ఇక్కడే నిర్వహించనుంది. దీని వల్ల కాఫీ క్యూరింగ్, తయారీ కోసం ఏపీఎఫ్‌డీసీ, ప్రైవేట్ పార్టీలపై ఆధారపడాల్సిన అవసరం లేదు. ఇది గిరిజన కాఫీ సాగుదారులకు కూడా ప్రయోజనం చేకూరుతుంది. ఎందుకంటే కాఫీ తయారీకి రవాణా, మొదలైన ఓవర్‌హెడ్ చార్జీలు తగ్గుతాయి. కాబట్టి గిరిజనులకు జీసీసీ మెరుగైన ధర చెల్లించే అవకాశాలు పెరుగుతాయి.

నాణ్యతలో నంబర్‌వన్‌గా..



ఐదేళ్ల కాలంలో గిరిజనుల జీవితాల్లో జీసీసీ ఎన్నో మార్పులు తీసుకొచ్చింది. కోవిడ్ సమయంలోనూ వారి ఉత్పత్తులను సేకరిస్తూ.. గిట్టుబాటు ధర కల్పిస్తూ.. అన్ని విధాలా చేదోడుగా నిలిచాం. అందుకే కరోనా సమయంలోనూ జీసీసీ టర్నోవర్ తగ్గలేదు. గిరిజనులు సేకరిస్తున్న అన్ని ఉత్పత్తులు నాణ్యతలో నంబర్‌వన్‌గా ఉన్నాయి. అందుకే తిరుమల తిరుపతి దేవస్థానానికి జీసీసీ ఉత్పత్తులు అందించే అవకాశాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం కల్పించింది. జీసీసీ ఉత్పత్తులు తిరుమలలో వినియోగిస్తుండటం వల్ల ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. అంతేకాకుండా గిరిజనులకు మరింత మేలు కలుగుతోంది. కాఫీ రేటుని ఒకేసారి రూ.120 అదనంగా పెంచాం. కాఫీ గింజలు సేకరించినప్పుడు గతంలో రెండు దఫాలుగా అంటే.. సీజన్ మొదట్లో, చివర్లో పేమెంట్ చేసేవారు. ఇకపై ఇక్కడే ప్రాసెసింగ్ జరిపే ప్రక్రియ ప్రారంభమైతే.. ఆంధ్రాలోనే తయారీతో పేరుతో కాఫీ ఉత్పత్తులను విడుదల చేస్తాం.

– శోభా స్వాతిరాణి, జీసీసీ చైర్‌పర్సన్

సాక్షి క్లాసిఫైడ్స్

PASSPORT MISSING

I, NIRMAL SAGAR SODAVARAM, S/o Suryanarayan Sodavarm Residing at H.No. 52-14-33, Kranthi Nagar, Nakkavanipalem, Visakhapatnam - 530 013. I Have lost my Passport **(No.J3051264)**. while I was traveling by bike from my house to Maddilapalem. If any body find please Contact : 7538000614

CHANGE OF NAME

I, THUMMALA ABBIGARI LOKESWARA REDDY (New Name) S/o. Thummala Abbigari Narasimha Reddy, previously called TUMMALA ABBIGARI LOKESWARA REDDY (Old Name) resident of D.No. 24-277/12, Flat No.301, Simhadri Residency, Simhapuri Layout, Vepagunta, Pendurthi, Visakhapatnam - 530047, AP. Now changed my name from TUMMALA ABBIGARI LOKESWARA REDDY to THUMMALA ABBIGARI LOKESWARA REDDY. Henceforth I will be called as THUMMALA ABBIGARI LOKESWARA REDDY (New Name) for all purpose.

CHANGE OF NAME

I, KOYYE HANANYA S/o K.Varaprasad, Resident of Flat No.401, Sai Pranay Residency, Sarivada, Agnampudi, Gajuwaka, Visakhapatnam - 530046. A.P. Change my name from KOYYA HANANYA (Old Name) to KOYYE HANANYA (New Name) hence forth I am being called as KOYYE HANANYA for all purposes.

Education

- **Paramedical Science and Nursing** Courses Admission open now Praveen Institute of Paramedical & sciences. Please Contact : M/s. S.R.Hospital, Near Rythu Bazar, Gopalapatnam, Vizag. Call : Mr. T.Srinivas, General Manager. Ph : 82979 52222 [V- 2536]
- **SBI లైఫ్‌లో అడ్వైజర్స్ / సేల్స్ మేనేజర్స్ M/F** కావలెను. ఎక్స్‌ట్రా ఇన్‌కమ్ కొరకు. Rtd. Govt., Pvt. ఎంప్లాయిస్, బిజినెస్ పర్సన్స్, H.వైఫ్స్. 5 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ ఫ్రీ. 90522 16662 [V- 2538]
- **Job Opportunity : A Fast growing** Org. Shortly Opening New Branches in Vizag & Reqd. (1) Sr. Manager. (2) Field Officers. (3) PROs M/F Age : 30+ Yrly Pakage : 5-15 Lakhs (Gego) for Intrw. ✆ : 83415 15341, 95535 29529 [V-786860]

Services

GOLD LOANS

- లోకేష్ గోల్డ్ లోన్స్ :– బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :– 98484 88068/ 77992 23300 [V- 12047]
- ఆప్తా హోమ్ కేర్ హైదరాబాద్ కేర్ టేకర్స్ కావలెను. జీతం:18–20వేలు, సంవత్సరం లోపు 22–25కి పెరిగే అవకాశం. 20–45లోపు M/F ఉచిత భోజనం వసతి 9492637091 [G-2427]
- **Branch Managers - MBA+ Exp. & Mark** Executives - 8 / Receptionist / Tele Callers - 6, GLR Enterprises, Jagadamba (Tourism + Events + Placements) ✆ 73820 43258 [B-3482]

Wanted

- VJA, మొగల్‌రాజపురంలోని ప్రముఖ హోమ్ హెల్త్‌కేర్ ఆఫీస్‌కి పెద్ద వారిని వారి ఇంటివద్దనే వుండి చూసుకొనుటకు నమ్మకమైన కేర్ టేకర్స్ M/F ఆయాలు, నర్సులు M/F కావలెను. ✆ 91608 35559, 98850 25559 [B-061]
- ప్రముఖ బ్యూటీ సెలూన్ నందు పనిచేయుటకు 30 సంవత్సరాల లోపు గల ఫీమేల్ హెల్పర్స్ కావలెను. Qualification : Inter, Salary : 18,000/- అనుభవం అవసరంలేదు. ఫోన్ : 77801 53291 [V- 786872]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మురళీనగర్, మాధవధార	: 90101 33346
NAD, కంచరపాలెం	: 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	: 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	: 90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ, MVP కోలనీ, మద్దిలపాలెం	: 90101 96663
గాజువాక	: 97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

ముందస్తు 'నైరుతి'

- 31నే కేరళను తాకనున్న రుతుపవనాలు
- చల్లని కబురు అందించిన ఐఎండీ

సాక్షి, విశాఖపట్నం: ఎండలతో అల్లాడిపోతున్న రాష్ట్ర ప్రజలకు భారత వాతావరణ విభాగం(ఐఎండీ) చల్లని కబురు చెప్పింది. ఈ ఏడాది రుతుపవనాలు జూన్ ఒకటో తేదీన కేరళలోకి ప్రవేశించాల్సి ఉంది. కానీ ఈ సారి మే 31నే తాకుతాయని ప్రకటించింది. ఇందుకు వాయవ్య భారతదేశంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు, దక్షిణ భారతదేశంలో రుతుపవనాలకు ముందుగా కురుస్తున్న వానలు, దక్షిణ చైనా, నైరుతి పసిఫిక్ మహా సముద్రంపై ఔట్ గోయింగ్ లాంగ్ వేవ్ రేడియేషన్ (మేఘాలు కమ్ముకుని ఉండడం), ఆగ్నేయ హిందూ మహాసముద్రంలో భూమధ్య రేఖపై దిగువ స్థాయిలో గాలులు, ఈశాన్య హిందూ మహా సముద్రంలో భూమధ్య రేఖాప్రాంతంపై ఎగువ స్థాయిలో గాలులు వంటి ఆరు అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయానికి వచ్చింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజను సమృద్ధిగా వర్షాలను కురిపిస్తుందని, సాధారణం కంటే అధిక వర్షాలు కురుస్తాయని ఇప్పటికే ఐఎండీ ప్రకటించింది. ఎల్‌నినో ప్రభావం జూన్‌తో బలహీన పడి, లానినా ప్రభావం మొదలవుతుండడం ఇందుకు దోహదపడుతుందని పేర్కొంది. గతేడాది వారం రోజులు ఆలస్యంగా నైరుతి రుతుపవనాలు రావడంతో జూన్ ఆఖరి వరకు జనం అల్లాడిపోయారు. ఆ తర్వాత కూడా సకాలంలో వర్షాలు కురవక పంటలు కూడా ఆశాజనకంగా పండలేదు. ఈ సారి రుతుపవనాలు ఆలస్యం కాకుండా ఒకింత ముందుగానే ప్రవేశించనున్నందున రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గి వడగాడ్పుల బెడద తప్పనుంది.


గత ఐదేళ్లలో నైరుతి ఆగమనం ఇలా..

సంవత్సరం	ఆగమనం	అంచనా తేది
2019	జూన్ 8	జూన్ 6
2020	జూన్ 1	జూన్ 5
2021	జూన్ 3	మే 31
2022	మే 29	మే 27
2023	జూన్ 8	జూన్ 4

మూడు రోజులు వర్షాలు

దక్షిణ అంతర్గత కర్నాటక నుంచి తూర్పు విదర్భ వరకు ఉన్న ద్రోణి గురువారం బలహీన పడింది. అయినప్పటికీ గాలిలో తేమతో పాటు ఆగ్నేయ గాలులు వీస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ఒంగోలులో 5, ఓలేటివారిపాలెం(నెల్లూరు)లో 4.8, నందికొట్కూరు (నంద్యాల)లో 4.7, నాయుడుపేట(తిరుపతి)లో 2.7, పాయకరావుపేట (అనకాపల్లి)లో 2.3 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది.

యువత ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



ప్రసంగిస్తున్న భక్తి ప్రచార పరివ్రాజక స్వామి

కొమ్మాది: యువత ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని, ఆలయాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని భక్తి ప్రచార పరివ్రాజక స్వామి పిలుపునిచ్చారు. సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరంలో మూడు రోజులుగా జరుగుతున్న ఇస్కాన్ ఇండియా యూత్ కౌన్సిల్ (ఐఐవైసీ) సమావేశాలు గురువారంతో ముగిశాయి.

ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. నేటి యువత ఆధ్యాత్మిక భావనలు కలిగి ఉండి రేపటి తరానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందికి సనాతన ధర్మాన్ని బోధించే కార్యక్రమంలో భాగంగా విశాఖలో ఈ సమావేశాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ముందుగా ఆయన మందిరంలోని రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరేకృష్ణ మహా మంత్రంతో ఇస్కాన్ టెంపుల్ మార్మోగింది. ఈ సమావేశాల్లో ఇస్కాన్ ఇండియా యూత్ కౌన్సిల్ చైర్మన్ సుందర్ గోపాల్ రాజ్, సాగర్‌నగర్ ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని, పైడా కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్ 'కమర్షియల్' రికార్డ్

ఏప్రిల్‌లో రూ.2.8 కోట్ల ఆదాయం

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ కమర్షియల్ విభాగం సిబ్బంది ఏప్రిల్ నెలలో అత్యుత్తమ పనితీరు కనబరిచి, రికార్డు స్థాయి ఆదాయాన్ని సంపాదించారు. ఏప్రిల్ నెలలో వాల్తేర్ డివిజన్ కమర్షియల్ విభాగం చేపట్టిన 47, 837 డ్రైవ్‌ల ద్వారా సుమారు రూ. 2.8కోట్లు ఆదాయాన్ని ఆర్జించగలిగారు. గత రికార్డులన్నీ అధిగమించి ఈస్ట్‌కోస్ట్‌రైల్వే జోన్ పరిధిలోనే ఒక నెలలో అత్యధిక ఆదాయాన్ని ఆర్జించిన డివిజన్‌గా నూతన రికార్డు నెలకొల్పిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ సిబ్బందిని అభినందించారు. వాల్తేర్ డివిజన్, కమర్షియల్ సిబ్బంది అకుంఠిత దీక్ష, నిరంతర శ్రమ ఫలితంగా ఇది సాధ్యం అయిందని ప్రశంసించారు.

కోణార్క్ గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: ఛత్రపతి శివాజీ టెర్మినస్ స్టేషన్ పరిధిలో విస్తరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌ను గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు భువనేశ్వర్‌లో బయల్దేరే భువనేశ్వర్–ముంబై సిఎస్‌టిఎం (11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్ దాదర్ స్టేషన్ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జూన్ 1వ తేదీన మాత్రమే ముంబై సీఎస్‌టీఎంలో బయల్దేరాల్సిన ముంబై సీఎస్‌టీఎం– భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్ దాదర్ నుంచి బయల్దేరుతుంది.

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	550.00
విజయనగరం	554.00
శ్రీకాకుళం	554.00

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.138
బ్రాయిలర్ (లైవ్)	: రూ.158
స్కిన్	: రూ.286
స్కిన్‌లెస్	: రూ.296

క్షయ నివారణకు పెద్దలకూ బీసీజీ టీకా



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, చిత్రంలో జేడీ డాక్టర్ నిర్మల గౌరీ

మహారాణిపేట: క్షయ వ్యాధి నివారణ కోసం అడల్ట్ బీసీజీ టీకా పంపిణీ కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. వైద్యారోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్, నోడల్ అధికారి డాక్టర్ నిర్మల గౌరీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం జిల్లాతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో పలువురికి బీసీజీ టీకా వేశారు. స్వర్ణభారతి పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని టీపీటీ కాలనీ, ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గంభీరం, చందక ప్రాంతాల్లో వ్యాక్సినేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వర్ణభారతిలో జరిగిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ పెద్దలకు బీసీజీ వాక్సిన్ పంపిణీ కార్యక్రమం మూడు నెలల పాటు కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో అర్హులకు ఉచితంగా బీసీజీ వ్యాక్సిన్ వేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ నిర్మల గౌరీ మాట్లాడుతూ అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో 12 జిల్లాల్లో వ్యాక్సినేషన్ అమలు చేస్తున్నామని, అందులో విశాఖ ఒకటని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో హెల్పర్ మృతి




వెంకట రమణ మృతదేహం




కంపెనీ ప్రతినిధులతో చర్చిస్తున్న స్థానిక నేతలు, గ్రామ పెద్దలు

సబ్బవరం: గాలి భీమవరం సమీపంలోని బొగ్గు కంపెనీలో విద్యుత్ మరమ్మతులు చేపట్టేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కిన ఈపీడీసీఎల్ హెల్పర్ .. విద్యుత్ షాక్ తగలడంతో కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ.. ఆరిపాకకు చెందిన గొంప వెంకటరమణ(45) 35 ఏళ్లుగా ఈపీడీసీఎల్‌లో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. గాలిభీమవరం సమీపంలోని కోరమండల్ మెట్‌కోక్ పరిశ్రమలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో లైన్‌మన్ పినిశెట్టి రామకృష్ణకు ఫిర్యాదు అందించింది. దీంతో అతను వెంకటరమణను తీసుకుని కంపెనీ వద్దకు వెళ్లారు. రమణ ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి మరమ్మతులు చేస్తుండగా.. విద్యుత్ షాక్ తగిలి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న అతని భార్య వెంకటలక్ష్మి, కుమార్తె భాగ్యశ్రీ, కుమారుడు ప్రదీప్ కంపెనీ వద్దకు చేరుకుని.. మృతదేహం వద్ద బోరున విలపించారు. ఆరిపాక, గాలి భీమవరం, లగిశెట్టిపాలెం గ్రామాల ప్రజలు ఘటనా స్థలానికి చేరుకుని.. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. వెంకటరమణ కుమారుడికి ఈపీడీసీఎల్‌లో ఉద్యోగంతో పాటు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెట్ కోక్ కంపెనీ రూ.25 లక్షల పరిహారం అందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. డిమాండ్లు పరిష్కరించకపోతే మృతదేహంతో కంపెనీ ముందు నిరసన కొనసాగిస్తామని హెచ్చరించారు. దీంతో కంపెనీ ప్రతినిధులు రూ.15 లక్షలు చెల్లించేందుకు లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారు. ఈపీడీసీఎల్ అధికారులకు కూడా స్పష్టమైన హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

డెంగ్యూతో అప్రమత్తం



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వైద్య సిబ్బంది మానవహారం



గాంధీ విగ్రహం నుంచి ర్యాలీగా వెళ్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

మహారాణిపేట: జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మొదలైన ర్యాలీ లలితా జ్యూయలరీ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్, మెయిన్ రోడ్డు మీదుగా తిరిగి జీవీఎంసీకి చేరుకుంది. అనంతరం అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటి డెంగ్యూ కేసు 1964లో విశాఖలో నమోదు అయిందన్నారు. ఇది దోమల ద్వారా రోగగ్రస్తుల నుంచి ఆరోగ్యవంతులకు సంక్రమిస్తుందని తెలిపారు. దోమ కుట్టిన 5 నుంచి 8 రోజుల్లోపు వ్యాధి లక్షణాలు బయట పడతాయన్నారు. ఉధృతమైన జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, కండరాలు, కీళ్ల నొప్పులు, వాంతి అయినట్టు భ్రాంతి, నోరు ఎండిపోవడం, రక్తపోటు పడిపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వీటిలో ఏది ఉన్నా ఆస్పత్రికెళ్లి చూపించుకోవాలన్నారు. జిల్లా సర్వేలెన్స్ అధికారి డాక్టర్ జగదీష్ చంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఈ వ్యాధి నిర్మూలనకు దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలన్నారు. దోమ తెరల వాడుక, కిటికీలకు మెష్‌ల ఏర్పాటు సురక్షితమన్నారు. ఇంటి చుట్టు పక్కల పగిలిన సీసాలు, కొబ్బరి బొండాలు, ఖాళీ టైర్ల వంటివి లేకుండా జాగ్రత్తలు వహించాలన్నారు.